మాసాబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డికి బంద్ నోటీసు ఇస్తున్న డిగ్రీ కాలేజీ సంఘం యాజమాన్యాలు

నేటి నుంచి డిగ్రీ కాలేజీల నిరవధిక బంద్

- ఫీజు బకాయిల విడుదలకు డిమాండ్
- సర్కారుపై కాలేజీల యాజమాన్యాల కన్నెర్ర
- సెమిస్టర్ పరీక్షల బహిష్కరణకు నిర్ణయం

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల విడుదల డిమాండ్‌తో డిగ్రీ కాలేజీల యాజమాన్యాలు ఆందోళన బాట పట్టాయి. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ప్రభుత్వం నిర్లక్ష్యం వీడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరవధిక బంద్‌కు సిద్ధమయ్యాయి. డిగ్రీ సెమిస్టర్ పరీక్షలను కూడా బహిష్కరిస్తున్నట్టు తేల్చిచెప్పాయి. ప్రభుత్వం రూ.2వేల కోట్లు తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ డిగ్రీ, పీజీ కాలేజీల యాజమాన్యాల సంఘం స్పష్టంచేసింది. కాలేజీలు బంద్‌లో పాల్గొనాలని సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొజ్జ సూర్యనారాయణరెడ్డి, యాద రామకృష్ణ సోమవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉన్నత విద్యామండలి, వర్సిటీల అధికారులను కలసి బంద్‌కు వెళ్తున్నట్టు తెలిపారు. ఇక మాటలు వినే పరిస్థితుల్లో లేమని, బకాయిలు విడుదల చేసే వరకు బంద్ కొనసాగుతుందని స్పష్టంచేశారు.

సీఎం సమయమివ్వలేదు

తెలంగాణలో ఉన్నత విద్య నిర్లక్ష్యానికి గురైందని, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై మంత్రులు, అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా ఫలితం లేకుండా పోయిందని సూర్యనారాయణరెడ్డి, రామకృష్ణ ఆవేదన వ్యక్తంచేశారు. సీఎం రేవంత్‌రెడ్డి కనీసం తమకు సమయమివ్వలేదని వాపోయారు. 90శాతం కాలేజీలు 5 నెలలుగా జీతాలు ఇవ్వలేని, అద్దెలు చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. దసరా సెలవుల తర్వాత బంద్ పాటించామని, వారంలో నిధులు విడుదల చేస్తామన్న ప్రభుత్వ హామీ అమలు కాలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

సందిగ్ధంలో సెమిస్టర్ పరీక్షలు!

కాలేజీల బంద్ ప్రభావం డిగ్రీ సెమిస్టర్ పరీక్షలపై పడనుంది. డిగ్రీ 3, 5 సెమిస్టర్ పరీక్షలు ఈ వారంలో, ఓయూ పరీక్షలు నేటి నుంచి జరగాల్సి ఉంది. 21 నుంచి మహాత్మాగాంధీ, 26 నుంచి కాకతీయ, పాలమూరు వర్సిటీల పరీక్షలు ప్రారంభం కావాలి. ఈ నెలలోనే తెలంగాణ, శాతవాహన వర్సిటీల సెమిస్టర్ పరీక్షలు ఉన్నాయి. నెలాఖరు నుంచి డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు జరగాల్సి ఉంది. కానీ పరీక్షలు జరగకపోతే విద్యాసంవత్సరంపై తీవ్ర ప్రభావం చూపనుంది.

ఏసీబీకి చిక్కిన పంచాయతీరాజ్ ఏఈ

రూ.50 వేలు లంచం తీసుకుంటూ దొరికిన పాండురంగారావు

పాండురంగారావు

ఎర్రవల్లి చౌరస్తా, నవంబర్ 18: జోగుళాంబ గద్వాల జిల్లాలో సోమవారం పంచాయతీరాజ్ ఏఈ ఏసీబీకి చిక్కారు. ఏసీబీ డీఎస్పీ కృష్ణగౌడ్ కథనం ప్రకారం.. ఎర్రవల్లి మండలం రాజశ్రీ గార్లపాడులో రూ. 35 లక్షలతో మైనార్టీ కమ్యూనిటీహాల్ నిర్మించారు. పనులు పూర్తయి 6నెలలు కావస్తున్నా బిల్లులు రావడం లేదు. దీంతో కాంట్రాక్టర్లు మహ్మద్ హుస్సేన్,జగదీశ్వర్‌రెడ్డి, లాలు, లక్ష్మీనారాయణ బిల్లులు చేయాలని ఏఈ పాండురంగారావును కలిశారు. లక్ష లంచం ఇస్తే. . బిల్లులు పూర్తి చేస్తానని, లేకుంటే లేదని ఏఈ తేల్చి చెప్పాడు. కాంట్రాక్టర్లు 50 వేలు చెల్లించేందుకు అంగీకరించారు. ఎర్రవల్లి చౌరస్తాలోని ఓ షాపులో రూ. 50 వేలు ఏఈకి ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకొని విచారిస్తున్నారు.

విద్యుత్తు దీపాల వెలుగుల్లో హనుమకొండలో బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన కాళోజీ కళాక్షేత్రం

ఓరుగల్లులో కాళోజీ భారీ కళాక్షేత్రం

- రూ.85.10 కోట్లతో నిర్మించిన కేసీఆర్ సర్కారు
- రంగులు వేయడం పూర్తి చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- నేడు ప్రారంభించనున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

వరంగల్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): వారసత్వ, చారిత్రక, సాంస్కృతిక రంగాల్లో వరంగల్ గుర్తింపును మరింత ఇనుమడింపచేసేలా కేసీఆర్ ప్రభుత్వం ప్రజాకవి కాళోజీ నారాయణరావు పేరుతో కళాక్షేత్రాన్ని నిర్మించింది. హనుమకొండ బస్టాండ్ సమీపంలో.. కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) మైదానంలో 4.25 ఎకరాల్లో రూ.85,10 కోట్లతో భారీ భవనాన్ని విభిన్నశైలిలో తీర్చిదిద్దారు. 1.39 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో.. నాలుగు అంతస్థుల సువిశాల భవనంలో.. 1500 సీటింగ్ సామర్థ్యంతో ఒక ఆడిటోరియంను ఏర్పాటు చేశారు. మినీ మీటింగ్ హాల్, డైనింగ్ హాల్స్, వీఐపీ సూట్స్‌ను అత్యాధునికంగా నిర్మించారు. గ్రౌండ్ ఫ్లోర్‌లో రెండు మేకప్ రూములు, ఆర్ట్ గ్యాలరీ ఉన్నాయి. గ్యాలరీలో కూర్చుని చూడటానికి వీలుగా ఫ్రీ ఫంక్షన్ లాబీని ఏర్పాటు చేశారు. సందర్శకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాలుగు హై కెపాసిటీ లిఫ్ట్‌లను బిగించారు. ఈ కళాక్షేత్రానికి కాంగ్రెస్ ప్రభుత్వం రంగులు వేసి ప్రారంభానికి సిద్ధం చేసింది. మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దీనిని ప్రారంభించనున్నారు.

కేసీఆర్ సంకల్పం

'పుట్టుక నీది, చావు నీది.. బతుకంతా దేశానిది' అని రాయడంతోపాటు జీవితాంతం ఆచరించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడారు. 2012 నవంబర్ 13న ఆయన కన్నుమూశారు. తెలంగాణలోని కవులపై నిర్లక్ష్యంగా వ్యవహరించే అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు పద్మభూషణ్ గుర్తింపు ఉన్న కాళోజీ నారాయణరావు విషయంలోనూ అలాగే చేశాయి. కాళోజీ నారాయణరావు స్మారక భవనం కోసం వరంగల్ నగరంలో కనీసం 300 గజాలు కేటాయించాలని కాళోజీ ఫౌండేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. అయినా.. అప్పటి ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి ఈ విజ్ఞప్తిని పట్టించుకోలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కాళోజీ నారాయణరావును గొప్పగా స్మరించుకుందామని అప్పటి ఉద్యమనేత కేసీఆర్ కాళోజీ ఫౌండేషన్ వారికి భరోసా కల్పించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యారు. కాళోజీ నారాయణరావు శతజయంతి అయిన 2014 సెప్టెంబర్ 9న ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ తొలిసారి వరంగల్ నగరానికి వచ్చారు. కళాక్షేత్రం భవన నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. ప్రధాన రహదారి పక్కనే 4.25 ఎకరాల్లో నాలుగు అంతస్థులతో నిర్మాణం ప్రారంభించారు. సాంస్కృతిక, పర్యాటక శాఖ మొదట్లో ఈ పనులు చేపట్టగా, తర్వాత కరోనా కారణంగా మూడేండ్లు నెమ్మదిగా సాగాయి. అప్పటి మున్సిపల్ మంత్రి కేటీఆర్ 2022లో సమీక్షించి కుడా నిధులతో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. అప్పటి నుంచి పనులు వేగంగా జరిగాయి. రూ.85.10 కోట్లతో సకల హంగులతో భవన నిర్మాణం పూర్తయ్యింది.

ఇన్‌స్టా ప్రేమ.. సహజీవనం.. పెండ్లి.. హత్య

- ప్రేమ పేరుతో బాలికకు వల
- కలసి 10 రోజుల సహజీవనం!
- పెండ్లికి ఒత్తిడి తేవడంతో దారుణహత్య
- వీడిన మియాపూర్ మిస్సింగ్ కేసు మిస్టరీ

దండలు మార్చుకున్న బాలిక, చింటూ

కొండాపూర్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): మియాపూర్ 17ఏళ్ల బాలిక మిస్సింగ్ కేసు మిస్టరీ వీడింది. తుక్కుగూడలోని ఓ ప్లాస్టిక్ పరిశ్రమ వద్ద బాలిక మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. బాలికను ప్రేమ పేరుతో వలలో వేసుకున్న ఉప్పుగూడ యువకుడు, దొంగతనం కేసులో పాతనేరస్థుడు విఘ్నేశ్ అలియాస్ చింటూ హత్య చేసినట్టు నిర్ధారించారు. ఈ మేరకు హంతకుడు విఘ్నేశ్‌తో పాటు హత్యకు సహకరించిన మరో ఇద్దరిని మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు సీఐ క్రాంతికుమార్ కేసు వివరాలను పెల్లడించారు.

ప్రాణం తీసిన ఆన్‌లైన్ లవ్

హైదరాబాద్ మియాపూర్ టీఏ నగర్‌కు చెందిన బాలిక(17)కు ఉప్పుగూడకు చెందిన విఘ్నేశ్ అలియాస్ చింటూతో ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం ఏర్పడింది. ఐదు నెలల క్రితం ఇద్దరు ఫలక్‌నుమాలోని ఓ గుడివద్ద కలుసుకున్నారు. ఆ తర్వాత తరువాత ఇన్‌స్టాగ్రామ్‌లో చాటింగ్ చేసుకుంటూ మరింత స్నేహంగా మారారు. ప్రేమిస్తున్నానంటూ విఘ్నేశ్ ప్రపోజ్ చేయగా ఆ బాలిక అంగీకరించింది. మియాపూర్ వెళ్లిన విఘ్నేశ్ దాదాపు 20 రోజుల క్రితం బాలికను ఉప్పుగూడకు తీసుకెళ్లాడు. విఘ్నేశ్ స్నేహితుడు సాకేత్, కల్యాణి దంపతులకు పరిచయం చేశాడు. దీంతో సాకేత్ ఇల్లు ఖాళీ చేసి కంచన్‌బాగ్‌లోని మరో ఇంటికి షిఫ్ట్ అయ్యాడు. వీరితో పాటే విఘ్నేశ్, బాలిక నివసించారు. ఆ బాలిక తల్లిదండ్రులతో టచ్‌లోనే ఉంది. ఆమె తల్లిదండ్రులు కూడా పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. సదరు బాలిక దాదాపు 10 రోజుల పాటు విఘ్నేశ్‌తో సహజీవనం చేసింది. ఈ క్రమంలో బాలిక ఇతరులతో ఫోన్‌లో మాట్లాడుతున్నదని విఘ్నేశ్ మందలించాడు. ఇద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి. పెళ్లి చేసుకోవాలంటూ విఘ్నేశ్‌ను బాలిక నిలదీసింది. బాలికను హత్య చేయాలని విఘ్నేశ్ నిర్ణయించుకున్నాడు. ఈ విషయాన్ని సాకేత్, కల్యాణి దంపతులకు చెప్పాడు. పెళ్లి చేసుకుని హత్య చేస్తే ఎవరికీ అనుమానం రాదని వారు సలహా ఇచ్చారు. ఈ నెల 8న విఘ్నేశ్, బాలిక పెళ్లి చేసుకున్నారు. తాను విఘ్నేశ్‌ను పెళ్లి చేసుకున్నానని, వారంలో ఇంటికి వస్తానని ఆ బాలిక తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పింది. సాకేత్ దంపతులు ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన తర్వాత విఘ్నేశ్ బాలిక తలను గోడకేసి కొట్టి దారుణంగా హత్య చేశాడు. ఆ తర్వాత ఇంటికి వచ్చిన సాకేత్, కల్యాణి సహకారంతో బాలిక మృతదేహాన్ని తుక్కుగూడలోని నిర్మానుష్య ప్రదేశంలో పడేశాడు. మరుసటి రోజు 9న బాలిక తల్లిదండ్రులకు ఫోన్ చేసిన విఘ్నేశ్.. "మీ బిడ్డ ఇంటికి వచ్చిందా" అని అడిగాడు. అనుమానం వచ్చిన బాలిక తల్లిదండ్రులు మియాపూర్ పోలీసులకు 10న ఫిర్యాదు చేయడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విఘ్నేశ్‌ను విచారించగా నేరం అంగీకరించారు. ఓఆర్ఆర్ సమీపంలో కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. విఘ్నేశ్‌తో పాటు సాకేత్, కల్యాణిని పోలీసులు అరెస్ట్ చేశారు.

విశ్వాస ఘాతుక కాంగ్రెస్

మొదటిపేజీ తరువాయి...

అయ్యారు. సత్యవాది అయిన కాళోజీ నారాయణరావు కళాక్షేత్రాన్ని ప్రారంభించే హక్కు అసత్యవాది అయిన రేవంత్‌రెడ్డికి ఎక్కడిది? అని నిలదీశారు. బీఆర్ఎస్ పాలనలో నిర్మితమైన కళాక్షేత్రానికి కాంగ్రెస్ సర్కార్ రంగులు వేసి రిబ్బన్ కట్ చేయడం సిగ్గుచేటని విరుచుకుపడ్డారు.'ఎన్నికల ముందట వరంగల్ రైతు డిక్లరేషన్ పేరిట గొప్పలు చెప్పి..ఇప్పుడు రైతుబంధు ఎగ్గొట్టి, రుణమాఫీకి ఎగనామం పెట్టి, కౌలు రైతుకిచ్చిన హామీలను గాలికొదిలిన రేవంత్‌రెడ్డి, ఏ ముఖం పెట్టుకొని ఇక్కడ సభ పెడుతున్నారు?' అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పొద్దున లేస్తే అబద్ధాలు చెప్పే రేవంత్‌రెడ్డి, కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభిస్తే కాళోజీ ఆత్మ ఘోషిస్తుందని ఆక్షేపించారు. ఆచార్య జయశంకర్, చాకలి ఐలమ్మ, సమ్మక్క సారలమ్మ లాంటి పోరాటయోధులు పుట్టిన గడ్డపై కాంగ్రెస్ విజయోత్సవ సభ పెట్టడం బాధాకరమన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని

తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నేతలు సోమ భరత్‌కుమార్, డాక్టర్ ఆంజనేయగౌడ్, పల్లె రవికుమార్, అలకుంట హరితో కలిసి విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో ఆరు గ్యారెంటీలను అటకెక్కించి మోసం చేసిన సీఎం రేవంత్, మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో సిగ్గులేకుండా అబద్ధాలు ప్రచారం చేయడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. ప్రతి నెలా రూ.30 వేల కోట్ల రాబడి వస్తేనే పాలన సాఫీగా సాగుతుందని, కేవలం రూ.18 వేల కోట్లే వస్తున్నాయని చెప్పున్న ముఖ్యమంత్రి ఏ పథకాలకు కోతపెడతారో చెప్పాలని నిలదీశారు. లగచర్ల ఘటనతో రాష్ట్రంలో ఎమర్జెన్సీ తరహా వాతావరణం బయట ప్రపంచానికి తెలిసిందన్నారు.

భుజంగరావు బెయిల్ పొడిగింపు

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): ఫోన్ల ట్యాపింగ్ కేసులో మాజీ అదనపు ఎస్పీ భుజంగరావుకు మంజూరైన మధ్యంతర బెయిల్‌ను హైకోర్టు ఈ నెల 28 వరకు పొడిగించింది. ఈ మేరకు జస్టిస్ కే సుజన సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే కేసులో బెయిల్ కోసం మరో నిందితుడు రాధాకిషన్‌రావు దాఖలు చేసుకున్న పిటిషన్‌పై విచారణ ఈ నెల 21కి వాయిదా పడింది.

మెడికల్ పీజీ అడ్మిషన్లలో స్థానికత

వివాదంపై విచారణ 25కు వాయిదా

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): మెడికల్ పీజీ అడ్మిషన్లలో 'స్థానికత' వివాదానికి సంబంధించిన పిటిషన్లపై విచారణ ఈ నెల 25కు వాయిదా పడింది. ఈ అడ్మిషన్లకు సంబంధించిన నిబంధనలను సవరిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో 148కి వ్యతిరేకంగా దాఖలైన పలు పిటిషన్లపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే శ్రీనివాసరావు ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. జీవో 148 ప్రకారం తెలంగాణలో ఎంబీబీఎస్ చేసిన వారిని మాత్రమే స్థానికులుగా పరిగణిస్తున్నారని పిటిషనర్ల తరపు న్యాయవాది వాదించారు. దీనిపై అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి స్పందిస్తూ.. పిటిషనర్లు లేవనెత్తిన అంశాలపై కౌంటరు దాఖలు చేసేందుకు గడువు కావాలని కోరారు. ఈ నెల 25 వరకు మెరిట్ జాబితాను ప్రకటించబోమని హామీ ఇచ్చారు. దీంతో ధర్మాసనం తదుపరి విచారణను ఈ నెల 25కు వాయిదా వేసింది.

వివేకా హత్యకేసులో ఉమాశంకర్‌రెడ్డికి బెయిల్

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో మూడో నిందితుడైన గజ్జల ఉమాశంకర్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టు సోమవారం బెయిలు మంజూరు చేసింది. రూ.25 వేల వ్యక్తిగత బాండ్‌తోపాటు అంతే మొత్తానికి మరో రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. ప్రతి శనివారం పులివెందుల ఎస్‌హెచ్‌వో ముందు హాజరుకావాలని చెప్పింది.

- ఒకే కాన్పులో ముగ్గురు

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ దవాఖానలో జయ అనే గర్భిణి సోమవారం ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది. మొదటి కాన్పులో పాప పుట్టగా.. ఇప్పుడు ఒక ఆడపిల్ల, ఇద్దరు మగ శిశువులు జన్మించారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. – గద్వాల అర్బన్

ఎస్సీ, ఎస్టీలకు వాహనాల రాయితీ నిలిపివేత

- పరిశ్రమల శాఖ ఉత్తర్వులు జారీ
- బీఆర్ఎస్ హయాంలో డ్రైవర్లను ఓనర్లుగా మార్చిన టీ-ప్రైడ్

హైదరాబాద్, నవంబర్ 18(నమస్తే తెలంగాణ): ఎస్సీ, ఎస్టీ వర్గాలతోపాటు దివ్యాంగులకు టీ-ప్రైడ్ (తెలంగాణ స్టేట్-ప్రోగ్రాం ఫర్ ర్యాపిడ్ ఇంక్యుబేషన్ ఫర్ దలిత్ ఎంటర్‌ప్రెన్యూర్) పథకం కింద ట్యాక్సీలు, ఇతర వాహనాలు కొనుగోలు చేసేందుకు ఇస్తున్న రాయితీని ఈ ఏడాది డిసెంబర్ 1వ తేదీ నుంచి నిలిపివేస్తున్నట్టు పరిశ్రమల శాఖ ప్రకటించింది. ఈ నిర్ణయంతో సొంతంగా వాహనాలు కొనుగోలు చేసుకొని ట్రాన్స్‌పోర్టు వ్యాపారంలో రాణించాలనుకునే వారి ఆశలపై నీళ్లు చల్లినట్టైంది. ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధి కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం టీ-ప్రైడ్ పథకాన్ని అమలుచేసింది. బలహీనవర్గాలకు చెందిన యువత, నిరుద్యోగులు సొంతంగా తమ కాళ్లపై తాము నిలబడేందుకు వివిధ వ్యాపారాలు చేసుకునేందుకు, చిన్నతరహా పరిశ్రమలు స్థాపించుకునేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం విరివిగా ప్రోత్సాహకాలు, రాయితీలు అందించింది. ఇందులో భాగంగా ట్యాక్సీలు, లారీలు, బస్సులు తదితర వాహనాలు కొనుగోలుచేసి ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారం చేసుకునేందుకు భారీ మొత్తంలో రాయితీలు అందించింది. దీంతో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన వేలాది మంది లాభపడ్డారు. ప్రైవేటు వ్యక్తుల వద్ద డ్రైవర్లుగా పనిచేస్తున్నవారు, ట్రాన్స్‌పోర్ట్ కంపెనీల్లో డ్రైవర్లుగా పనిచేసేవారు సొంతంగా వాహనాలు కొనుగోలు చేసుకొని యజమానులుగా మారారు. ఎంతోమంది ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన యువకులు ఇతరుల వద్ద చేస్తున్న ఉద్యోగాలు మానుకొని సొంత కార్లు కొనుగోలు చేసుకొని ఓలా, ఉబర్ వంటి సంస్థలకు పనిచేస్తూ ఆర్థికంగా వృద్ధి చెందుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం ఎస్సీ, ఎస్టీ వర్గాలను తీవ్ర నిరాశకు గురిచేసింది.

జేఈఈ అడ్వాన్స్‌డ్ రాసేది రెండుసార్లే..

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): జేఈఈ అడ్వాన్స్‌డ్ విషయంలో జాయింట్ అడ్మిషన్స్‌బోర్డు(జాబ్) యూటర్న్ తీసుకుంది. రెండు వారాల క్రితం మూడుసార్లు రాసే అవకాశం ఇచ్చిన జాబ్‌బోర్డు తాజాగా రెండుసార్లకు కుదించింది. ఈ నెల 15న జాబ్ బోర్డు సమావేశాన్ని నిర్వహించగా, మూడు నుంచి రెండు సార్లకు తగ్గిస్తూ నిర్ణయం తీసుకోగా, ఈ నిర్ణయాన్ని ఐఐటీ కాన్పూర్ సోమవారం వెల్లడించింది. ఒక విద్యార్థి వరుసగా రెండేండ్లు జేఈఈ అడ్వాన్స్‌డ్ రాసే అవకాశముండగా, మూడుసార్లు రాసుకునే అవకాశం ఇస్తున్నట్టు ఈ నెల 5న జాబ్‌బోర్డు ప్రకటించింది. 2013 నుంచి అమలుచేస్తున్న పాత నిబంధనలే అమల్లో ఉంటాయని ఐఐటీ కాన్పూర్ తాజాగా ప్రకటించింది. దీంతో జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఎలాంటి మార్పు లుండవని స్పష్టమయ్యింది.

ఏఐ టెక్నాలజీతో 2 గంటల్లోనే శ్రీవారి దర్శనం

- శ్రీనివాస సేతును గరుడవారధిగా మార్చాలని నిర్ణయం
- శ్రీవాణి ట్రస్టు పేరు మార్పు సాధ్యాసాధ్యాల పరిశీలన
- టీటీడీ పాలకమండలి వివరాలు వెల్లడించిన చైర్మన్

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తేతెలంగాణ): తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) నూతన పాలక మండలి సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నది. సోమవారం చైర్మన్ బీఆర్ నాయుడు అధ్యక్షతన తిరుమలలోని అన్నమయ్య భవన్‌లో తొలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి నిర్ణయాలను చైర్మన్ మీడియాకు వివరించారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ఉపయోగించి క్యూలైన్లలో భక్తులు ఎక్కువసేపు వేచి ఉండకుండా 2 లేదా 3 గంటల్లోనే దర్శనమయ్యేలా నిపుణుల కమిటీ ఏర్పాటుచేయాలని నిర్ణయించినట్టు ఆయన తెలిపారు. ఈ కమిటీ ఇచ్చే రిపోర్టు ఆధారంగా భక్తులకు త్వరితగతిన దర్శనం చేయించేందుకు ఏర్పాట్లుచేస్తామని చెప్పారు. టీటీడీలో పనిచేసే అన్యమత ఉద్యోగులను బయటకు పంపేందుకు ఎలాం టి చర్యలు తీసుకోవాలనే విషయమై ప్రభుత్వానికి నివేదించినట్టు తెలిపారు. శ్రీనివాస సేతును గరుడవారధిగా పేరు మార్చేందుకు నిర్ణయించినట్టు చెప్పారు. తిరుమలలో రాజకీయాలు మాట్లాడేవారిని, ప్రచారం చేసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్థానికులకు ప్రతి నెలా మొదటి మంగళవారం శ్రీవారి దర్శనం కల్పించేలా నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. శ్రీవాణి ట్రస్టు పేరు మార్చేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించి, వచ్చే సమావేశంలో ఒక రిపోర్టు ఇవ్వాలని ఆదేశించినట్టు తెలిపారు. వివిధ రాష్ట్రాలకు చెందిన టూరిజం కార్పొరేషన్లు, ఏపీఎస్ఆర్టీసీ, టీఎస్ఆర్టీసీలకు టీటీడీ కేటాయించిన శ్రీవారి ప్రత్యేక ప్రవేశ దర్శనం(రూ.300) టికెట్లకు సంబంధించి అవకతవకలు జరిగాయన్న ఫిర్యాదులు నేపథ్యంలో.. వాటిని పరిశీలించిన అనంతరం సదరు సంస్థలకు కోటాను పూర్తిగా రద్దు చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. శారదా పీఠానికి చెందిన మఠం నిర్మాణంలో అవకతవకలపై కమిటీ నివేదిక ఆధారంగా భవనం లీజును రద్దు చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. శ్రీవారి ఆలయంలో లీకేజీల నివారణకు, అన్నప్రసాద కేంద్రం ఆధునీకరణకు టీవీఎస్ సంస్థతో ఒప్పందం చేసుకున్నామని, దీని ప్రకారం సంస్థ పనులు చేపట్టనున్నట్టు చైర్మన్ వెల్లడించారు.

26న 'గ్రూప్-4' నియామకపత్రాలు!

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): గ్రూప్-4లో ఉద్యోగాలు పొందిన వారికి ఈ నెల 26న నియామకపత్రాలిచ్చే అవకాశముంది. ఇందుకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించినట్టు తెలిసింది. గ్రూప్-4 ఫలితాలను 14న విడుదల చేశారు. మొత్తం 8,084 మంది అభ్యర్థులకు గ్రూప్-4 ఉద్యోగాలిచ్చారు.

ఇరిగేషన్‌కు 49 మంది జేఏలు

- అత్యధికంగా సిద్దిపేట జిల్లాకు 17మంది..

హైదరాబాద్, నవంబర్18 (నమస్తే తెలంగాణ): ఇరిగేషన్‌శాఖలో కొత్తగా 49మంది జూనియర్ అసిస్టెంట్లు(జేఏ) రానున్నారు. ప్రభుత్వం గ్రూప్-4 ఫలితాలను ఇటీవలే వెల్లడించింది. ఇరిగేషన్‌శాఖకు 50 పోస్టులు మంజూరయ్యాయి. టీజీపీఎస్సీ ప్రస్తుతం 49 పోస్టులకే అభ్యర్థులను ఎంపిక చేసింది. ఆ జాబితాను ఇరిగేషన్‌శాఖ అధికారులకు పంపించింది. అత్యధికంగా సిద్దిపేట జిల్లాకు 17 మంది జూనియర్ అసిస్టెంట్లను(జేఏ) కేటాయించారు.

సమగ్రశిక్ష ఉద్యోగులు సమ్మెకు సన్నద్ధం!

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): సమగ్రశిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, లేకుంటే 15 రోజుల్లో నిరవధిక సమ్మెకు దిగుతామని ఉద్యోగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం విద్యాశాఖ ఉన్నతాధికారులను కలిసి సమ్మె నోటీసును అందజేశారు. గతంలో తాము సమ్మెకు దిగినప్పుడు పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి నెల రోజుల్లో సచివాలయానికి పిలిచి రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. 11 నెలలు గడిచినా తమను పట్టించుకోవడంలేదని వాపోయారు. ప్రధాన కార్యదర్శి ఝాన్సీసౌజన్య, అనిల్‌చారి, సత్యనారాయణ, అమృత తదితరులు సమ్మె నోటీసు ఇచ్చినవారిలో ఉన్నారు.

నైపుణ్య శిక్షణకు ఎంవోయూ

హైదరాబాద్, నవంబర్ 18 (నమస్తే తెలంగాణ): డిగ్రీ విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి, ఉద్యోగావకాశాల కల్పనకు తెలంగాణ కాలేజియేట్ కమిషనరేట్ సోమవారం మూడు సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నది. కమిషనర్ శ్రీదేవసేన మార్గదర్శకంలో ఎస్‌జీబీఎస్ ఉన్నతి ఫౌండేషన్, బారాదరి కలెక్టివ్ సోషల్ వెల్ఫేర్ ఫౌండేషన్, లాంచ్ లీడ్ ఫౌండేషన్‌తో ఆశాఖ ఒప్పందాలు కుదుర్చుకున్నది. సోమవారం నాంపల్లిలోని కమిషనరేట్ కార్యాలయంలో ఆర్జేడీలు డాక్టర్ యాదగిరి, డాక్టర్ రాజేంద్ర సింగ్ ఆయా సంస్థల ప్రతినిధులు సంజయ్‌మిట్టల్, హరిహర మీనన్, రవళి పరస్పరం ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.ఈ ఒప్పందం ద్వారా మూడు సంస్థలు పరిశ్రమ అవసరాలకు తగిన నైపుణ్యాలను అంచనావేయడంతోపాటు, శిక్షణ మాడ్యుళ్లను అందించడం, ఉపాధి అవకాశాల కల్పనను చ